## క్లుప్తంగా

### నాణ్యమైన విద్య అందించాలి



ఎక్కాలు చదివిస్తున్న ఎంఈవో ప్రకాశ్

కెరమెరి: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండలంలోని జైరాంగూడ, కొలాంగూడ(డి), గోండ్‌గూడ, చందాగూడ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. నెల రోజుల వరకు విద్యార్థి హాజరు కాకుంటే ఓఎస్సీ కింద పరిగణించాలన్నారు. రిజిస్టర్‌లో ఉన్న విద్యార్థులు విధిగా బడికి వచ్చేలా చూడాలన్నారు. ఆయన వెంట అనార్‌పల్లి ఎస్సీఆర్పీ నరేశ్ ఉన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న టీకానంద్

దహెగాం: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ 2025 క్యాలెండర్‌ను బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టీకానంద్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డీవైఎఫ్ఐ విద్యా, ఉపాధి, ఉద్యోగం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు మంజుల, నాయకులు లత, పూజ, మధుప్రియ, రమ్య, నాగరాజు, గిరిజన సంఘం నాయకులు నల్లిదామోదర్ పాల్గొన్నారు.

### నీటి శుద్ధి యంత్రం అందజేత



నీటి శుద్ధి యంత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: తాగునీటి సౌకర్యం కోసం విద్యార్థులకు వాటర్ ప్యూరిఫైర్ ఎంతో ఉపయోగపడుతుందని ఎంఈవో సుభాష్ అన్నారు. బుధవారం మండలంలోని అప్పపల్లి గ్రామంలోని పాఠశాలకు అదే గ్రామానికి చెందిన బద్రి సాయి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, నాయకులు బసవయ్య, పీసీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత



మొబైల్‌ఫోన్‌లు అప్పగిస్తున్న ఎస్సై మహేందర్

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో మొబైల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు బుధవారం ఈజ్‌గాం ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో మొబైల్‌ఫోన్‌లు అందజేశారు. ఆసిఫాబాద్ పైకాజీనగర్‌కు చెందిన రాజు, దర్గపల్లికి చెందిన వెంకటేశ్‌లు మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకుని సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా, మొబైల్ ఫోన్‌లను ట్రేస్ చేసి గుర్తించి బాధితులకు అప్పగించామన్నారు. సెల్‌ఫోన్‌లను గుర్తించడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీంను అభినందించారు.


### బీజేపీలో చేరికలు

కాగజ్‌నగర్‌రూరల్: దహెగాం మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలో గల ఎమ్మెల్యే హరీశ్ బాబు నివాసంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరిగెల రవి, వినోద్‌కుమార్, సుదర్శన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

నేరడిగొండ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని బుగ్గారాం(బి) గ్రామంలో జరుగుతున్న బుగ్గారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో పయనించాలన్నారు. యువతను ప్రోత్సాహించేందుకు ఎళ్లప్పుడు ముందుంటానన్నారు. కార్యక్రమంలో బోథ్ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వైస్ చైర్మన్ ఆడే వసంత్ రావ్, డైరెక్టర్ జాదవ్ రూప్‌సింగ్, రాజశేఖర్ రెడ్డి, కపిల్ దేవ్, మహేందర్, సద్దాం, శంకర్, హేమాజీ నాయక్, అనుపట్ల సంజీవ్, నారాయణ రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

# సమస్యల్లో దిగిడ



దిగిడ గ్రామం



బోరుబావికి అమర్చిన కనెక్షన్‌లు

- రెండు వారాలుగా అందని మిషన్ భగీరథ నీరు
- బోరుబావి నీరే దిక్కు
- పింఛన్ కోసం 20 కిలోమీటర్లు
- రేషన్ కోసం 5 కిలోమీటర్లు ప్రయాణం

దహెగాం: నేటి కంప్యూటర్ యుగంలోనూ సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందని గ్రామాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండి కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు మండలంలోని దిగిడ గ్రామస్తులు. గ్రామంలోని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ పొందడానికి, రేషన్ సరుకుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

**గ్రామంలో 102 కుటుంబాలు..**

మండలంలోని దిగిడ గ్రామంలో సుమారు 102 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలో అందరూ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. 486 జనాభా కలిగిన గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామంలో సుమారు 25 మంది వరకు పింఛన్‌దారులు ఉన్నారు. వీరు పింఛన్ పొందడానికి మండలంలోని 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరవెల్లి గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. పింఛన్ కోసం ప్రైవేట్ వాహనాల్లో ఒక్కొక్కరికి రానుపోను రూ. 200 చార్జీ చెల్లిస్తున్నామని వాపోతున్నారు. పింఛన్ కోసం వెళ్లిన సమయంలో అక్కడ సిగ్నల్ లేకుంటే చార్జీలు వృథా కావడంతో పాటు మరుసటి రోజు మళ్లీ వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్జి నుంచి రాంపూర్ వరకు మట్టి రోడ్డు ఉంది. రాంపూర్ నుంచి దిగిడ వరకు బీటీరోడ్డు ఉన్నా గుంతలమయంగా మారింది. ఇటీవల గుంతలు పడ్డ రోడ్డుపై మొరం మట్టి పోశారు. దీంతో వర్షాకాలంలో మట్టి బురదగా మారుతుందని వాపోతున్నారు.

**మిషన్ భగీరథ నీటికి తిప్పలు**

ఇంటింటికీ శుద్ధజలం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశ పెట్టింది. గ్రామంలో గత కొన్ని నెలల నుంచి మిషన్ భగీరథ తాగు నీరు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సోలార్ సిస్టం ద్వారా కులాయిల ద్వారా నీరు సరఫరా అవుతోంది. బోరు బావికి పైప్‌లైన్ బిగించుకోగా కరెంటు ఉన్న సమయంలో మాత్రమే బోరు మోటరు నడుస్తుందని కరెంటు లేకపోతే సోలార్ బోరు వద్దకు వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ గ్రామంలో ధ్వంసం కావడంతో లీకేజీలు ఉన్నందున తాగునీరు సరఫరా కావడం లేదని తెలిపారు. బోరు బావి నీరే తాగాల్సి వస్తుందని వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**నీరు రావడం లేదు..**



గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. బోరు నీరు పట్టుకుని తాగుతున్నాం. అధికారులు గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు ఇస్తున్నామని చెబుతున్నారు. కానీ మేము బకెట్ నీళ్లు కూడా ఇంతవరకు పట్టుకోలేదు. పైప్‌లైన్‌కు ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఉన్నాయి. భగీరథ తాగునీరు ఇంటింటికీ సరఫరా చేయాలి.

– సిడాం రమేశ్, దిగిడ

**రేషన్ కోసం తిప్పలు..**



గ్రామంలో రేషన్ దుకాణం లేదు. పక్క ఊరు రాంపూర్‌లో ఉండడంతో 5 కిలోమీటర్లు దూరం వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నాం. దిగిడ గ్రామానికి నెలలో ఒకరోజు మాత్రమే రేషన్ బియ్యం ఇస్తామని చెప్పారు. ఆరోజు పోకుంటే మరుసటి రోజు రేషన్ బియ్యం ఇవ్వడం లేదు. పింఛన్ కోసం ఏకంగా 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరవెల్లికి వెళ్తున్నాం.

– కుర్సెంగ ప్రేంసాగర్, దిగిడ

## ‘మహిళా శక్తి భరోసా’ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏపీవో మల్లయ్య

కెరమెరి: ఇందిరా మహిళా శక్తి భరోసా కింద మంజూరైన పనులను మార్చి 31వ తేదీ లోపు పూర్తి చేయాలని ఉపాధిహామీ పథకం ఏపీవో మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఈజీఎస్ టీఏ, ఎఫ్ఏలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువుల షెడ్లు, ఎరువు గుంతలు, ఫాంపాండ్, ఎంటీపీ, వ్యవసాయ బావులు, వ్యవసాయ రోడ్లు, వర్షం అధారిత ఇంకుడు గుంతలు, పశుగ్రాసం తదితర పనులు మహిళా శక్తి భరోసా కింద మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే 50 పనులు ప్రారంభం కాగా మిగిలిన పనులు త్వరలో ప్రారంభించాలని తెలిపారు. నర్సరీల్లో విత్తనాల పనులు ప్రారంభించాలని, కూలీలకు కూలి డబ్బులు విధిగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈసీ ఐక్యానాయక్, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

## ఈవ్‌టీజింగ్‌పై సమాచారమివ్వాలి



కెరమెరి: మాట్లాడుతున్న పోలీసులు

కెరమెరి: ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే తక్షణమే సమాచారం ఇవ్వాలని పోలీసులు లక్ష్మి, హారిక, రేష్మా అన్నారు. బుధవారం మండలంలోని మోడి కేజీబీవీలో విద్యార్థినులకు పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్‌వస్తే తెలపాలని, ప్రస్తుత తరుణంలో సైబర్ క్రైంలు అధికంగా జరుగుతున్నాయని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. పిన్న వయస్సులో వివాహాలు చేసుకోవద్దని పేర్కొన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేసుకుంటే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని పేర్కొన్నారు.

**చట్టాలపై నవోదయ విద్యార్థులకు అవగాహన**

కాగజ్‌నగర్‌రూరల్: మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలపై బుధవారం నవోదయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో షీటీం సభ్యులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ ఎస్సై రాజయ్య మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, మహిళలపై హింసకు ఎవరైనా పాల్పడితే వెంటనే షీటీం సభ్యులకు సమాచారం అందించాలన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పార్వతి, షీటీం సభ్యులు పాల్గొన్నారు.

## జాతరలో ఇబ్బందులు లేకుండా చూడాలి



పనులు పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: గంగాపూర్ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎస్సై చంద్రశేఖర్ సూచించారు. ఈనెల 11 నుంచి 13 వరకు గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న జాతర నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను బుధవారం ఎస్సై పరిశీలించారు. మండల కేంద్రంలోని రైల్వేగేట్ నుంచి ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదల తొలగింపు పనులతోపాటు ఆలయ పరిసరాల్లో వాహనాల పార్కింగ్, తైబజార్ దుకాణాల ఏర్పాట్ల కోసం స్థలాలు చదును చేస్తున్న పనులను ఎస్సై పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెసరు మదునయ్య, గంగాపూర్ పంచాయతీ కార్యదర్శి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గణపతి

బెజ్జూర్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలగడంతో పాటు శారీరకంగా దారుఢ్యం కలిగి ఉంటారని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూర్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు బుధవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికి తీసేందుకు పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కొంద్ర జగ్గాగౌడ్, దుబ్బుల నానయ్య, ఓంప్రకాశ్, షబ్బీర్, సుగుణ, భాగ్య, విశ్వేశ్వర్, క్రిష్ణ, మహేశ్, సురేశ్ గౌడ్ ఉన్నారు.

## ప్రభుత్వ భూములకు రక్షణ కరువు



చేడ్వాయిలో వెలసిన కట్టడాలు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామపంచాయితీలోని ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. గ్రామశివారులోని ఇరిగేషన్, రెవెన్యూ భూముల్లో అక్రమ కట్టడాలు వెలిశాయి. మద్దెన చెరువు సమీపంలోని మత్తడి వద్ద కట్టడాలు నిర్మించారు. మరోవైపు పంచాయతీ కార్యాలయం ఎదుట, రైతువేదిక వద్ద కొంత మంది వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు పోల్స్ ఏర్పాటు చేశారు. ఈవిషయంపై తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావును వివరణ కోరగా ఇరిగేషన్ భూములను ఆక్రమించి కట్టడాలను చేపడుతున్నట్లు ఇరిగేషన్ అధికారుల నుంచి ఫిర్యాదు అందిందన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించకుంటే చట్టప్రకారం కేసులు నమోదు చేసి అక్రమ కట్టడాలను తొలగిస్తామని తెలిపారు.

## ఎమ్మెల్యే కృషితోనే నిధులు మంజూరు



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కృషితోనే నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు రోడ్లు మంజూరయ్యాయని బీజేపీ మండలాధ్యక్షుడు కుంచాల విజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నియోజకవర్గానికి రూ.కోట్ల నిధులను ఎమ్మెల్యే విడుదల చేయించారని తెలిపారు. కొందరు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ దండె విఠల్ రోడ్లకు నిధులు మంజూరు చేశారని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు అన్ని విషయాలు తెలుసని, రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని గుర్తించి ఫలితాలు ఇస్తారన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు రవి, నాయకులు తిరుపతిగౌడ్, అశోక్, బాబురావు, చందు, భూమన్న, మధుకర్ పాల్గొన్నారు.

### పండ్ల దుకాణాలు పరిశీలన

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్‌చౌక్‌లో గల పండ్ల విక్రయ దుకాణాలను మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ బుధవారం పరిశీలించారు. రోడ్డు వరకు ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడం, ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని సందర్శించారు. రోడ్డు వరకు వేసిన షెడ్లను వెంటనే తొలగించాలని వ్యాపారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు

నేరడిగొండ: మండలంలోని బుగ్గరాం(బి) గ్రామంలో కొలువైన భీమన్న దేవుడికి కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతియేటా గ్రామంలో భీమన్న దేవుడిని పూజించడంతో గ్రామంలో సుఖశాంతులు నెలకొంటాయని తెలిపారు. ఈనెల 12న బుగ్గరాం(బి)లో గల భీమన్న గుట్టపై జాతర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట నాయకులు ఆడే వసంత్ రావ్, గంగారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నారాయణ రెడ్డి, కపిల్ దేవ్, పాల శంకర్ ఉన్నారు.

# సమయానికి రారెందుకో..?

- ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్న అధికారులు
- ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో? తెలియని పరిస్థితి
- మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సిబ్బంది తీరు





ఉదయం 10 గంటలు దాటినా తెరుచుకోని మండల పరిషత్ కార్యాలయం తలుపులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఉదయం 10.35 గంటలకు ‘సాక్షి’ విజిట్ చేయగా కార్యాలయ తలుపులు ఇంకా తెరుచుకోలేదు. మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవోతో పాటు నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్ విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ఉపాధిహామీ ఎంపీవోతో పాటు ఉపాధిహామీ ఆపరేటర్లు సైతం 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాగజ్‌నగర్ పట్టణం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

**‘మాకు పనులు ఉంటాయి’..**

ఉదయం 10.45 గంటల తర్వాత కొంతమంది సిబ్బంది కార్యాలయానికి వచ్చారు. వారిని ఎందుకు ఆలస్యంగా వస్తున్నారని ప్రశ్నిస్తే ‘మాకు పనులు ఉంటాయి.. గ్రామ పంచాయతీలు తిరుగుతూ వస్తున్నాం’ అంటూ వివిధ సాకులు చెబుతున్నారు. ప్రతీరోజు జిల్లా కేంద్రంలో పని ఉందని చెబుతూ సమయం దాటిపోయిన తర్వాత విధులకు హాజరవుతున్నారు. కొన్ని నెలల నుంచి వారు ఆలస్యంగానే కార్యాలయానికి వస్తున్నారని మండలవాసులు ఆరోపిస్తున్నారు. కార్యాలయ సిబ్బందిని ప్రశ్నిస్తే జిల్లా అధికారులతో సమీక్షలు ఉన్నాయని, కార్యాలయ ఇతర పనుల కోసం వెళ్లామని చెబుతున్నారని మండల ప్రజలు పేర్కొంటున్నారు. తమ సొంత అవసరాలు ఉండి కార్యాలయానికి రాని రోజు కూడా వచ్చినట్లుగానే రికార్డుల్లో నమోదు చేస్తున్నారని విమర్శలు విన్పిస్తున్నాయి. కార్యాలయంలో పనిచేసే అటెండర్, ఈపంచాయతీ ఆపరేటర్ తప్పా మిగతా సిబ్బంది ఎవరూ కూడా అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ఉన్నతాధికారులు వస్తే మరోలా..**

మండల కేంద్రంలో ఉన్నతాధికారుల పర్యటన ఉంటే మాత్రం సిబ్బంది మొత్తం ఉదయమే వచ్చి హడావుడి చేస్తుంటారు. కానీ మరుసటి రోజు నుంచి అధికారులు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి ఉంటుంది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**సాయంత్రం 3.30 గంటలకు వెళ్లడమే..**

ఉదయం 10 గంటల లోపు అధికారులు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అధికారులు మాత్రం 11 గంటలు దాటినా రావడం లేదు. పైగా సాయంత్రం 3.30 గంటలకే కార్యాలయం నుంచి వెనుదిరిగి వెళ్లిపోతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంపై మండల ప్రత్యేక అధికారి నదీమొద్దీన్‌ను వివరణ కోరగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాత్రం బుధవారం ఒక్కరోజు గ్రామ పంచాయతీలల్లో పర్యటించారన్నారు. మిగితా సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

## మద్యం, దేశీదారు పట్టివేత



పట్టుకున్న దేశీదారుతో ఎక్సైజ్ అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో అక్రమ మద్యం, దేశీదారు కలిగి ఉన్నారనే సమాచారం మేరకు బుధవారం దాడులు నిర్వహించి అక్రమ మద్యం, దేశీదారును పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. 180 ఎంఎల్ పలు రకాలకు చెందిన 152 మద్యం బాటిళ్లను స్వాధీనపర్చుకుని రత్న శ్రీకాంత్, ఒగ్గు దివాకర్, అన్షుమాన్ సింగ్‌లపై కేసు నమోదు చేశామన్నారు. అదేవిధంగా దేశీదారు తరలిస్తూ పట్టుబడిన యేనం రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు లోభానంద్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని మొగడ్‌దగడ్ చౌరస్తాలో బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండె విఠల్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్సీ దండె విఠల్ చొరవతో కౌటాల నుంచి తుమ్మిడిహెట్టి రోడ్డు మరమ్మతులకు రూ. 8 కోట్లు, మొగడ్‌దగడ్ నుంచి తాటినగర్ వరకు రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నికాడే గంగారాం, నాయకులు డబ్బా బాపు, పసునూరి తిరుపతి, రవీందర్ గౌడ్, రవి, సోమయ్య, ఆత్మారాం, ఏమాజీ, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899